# సాక్షి
## ములుగు

శనివారం । 14 । అక్టోబర్ । 2023




**మావోయిస్టు కొరియర్ల అరెస్ట్**
నలుగురు మావోయిస్టు కొరియర్లను అరెస్ట్ చేసినట్లు వెంకటాపురం (కె) సీఐ కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి విప్లవ సాహిత్య పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు. - IIలో▸



**సమాజాభివృద్ధికి యువత..**
సమాజాభివృద్ధికి యువత నడుంబిగించాలని హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ తెలిపారు. మహబూబాబాద్‌లో నిర్వహించిన పీవైఎల్ మహాసభలో పాల్గొని మాట్లాడారు. - IIలో▸



గరిష్టం/కనిష్టం
$34.0^0$ /$24.0^0$

**వాతావరణం**
జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### ఎన్నికల నిబంధనలు పాటించాలి



**వెంకటాపురం(ఎం):** ఎన్నికల నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించి పోలీసులకు సహకరించాలని ములుగు డీఎస్పీ రవీందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ములుగు సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై చల్ల రాజు పాల్గొన్నారు.

### దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**మంగపేట:** మండల కేంద్రంలోని ఉమా చంద్రశేఖరస్వామి ఆలయంలో ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించే ఉమాదేవి శరన్నవరాత్రి (దసరా) మహోత్సవ వేడుకల పోస్టర్లను ఉమాచంద్రశేఖరస్వామి దేవస్థానం చైర్మన్ కోలగట్ల నరేష్‌రెడ్డి కమిటీ సభ్యులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ నరేష్‌రెడ్డి మాట్లాడుతూ దసరా పర్వదిన మహోత్సవ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయ అభివృద్ధికి సహకరించి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దాట్ల మణివర్మ, కొమరగిరి సాంమ్రాజ్యం, చాద మలయ్య, సురేష్, ఆలయ పూజారి నరేష్‌శర్మ పాల్గొన్నారు.

### అత్తింటి వేధింపులకు యువతి బలి

**ఏటూరునాగారం:** మండలంలోని పప్కాపురం గ్రామానికి చెందిన బందెల మౌనిక(23) అనే వివాహిత అత్తింటి వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మృతి చెందినట్లు ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఏడాది క్రితం బందెల రాములు, లక్ష్మీల కుమారుడైన రాజుతో వివాహం జరిగింది. వివాహం జరిగినప్పటి నుంచి భర్త, మామ, అత్త, ఆడబిడ్డ, మరిది కలిసి వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో వేధింపులు భరించలేక మౌనిక ఈ నెల 2వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంత మౌనిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి సోదరుడు శశికుమార్ ఫిర్యాదు మేరకు మౌనిక మృతికి కారణమైన భర్త రాజు, మామ రాములు, అత్త లక్ష్మి, ఆడబిడ్డ రజిత, మరిది నరేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### దొంగతనానికి పాల్పడిన యువకులకు దేహశుద్ధి

**వెంకటాపురం(కె):** మండల పరిధిలోని పాలెం గ్రామ సమీపంలో మిర్చి తోటలో పనిచేస్తున్న కూలీల వద్ద దొంగతనం చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు యువకులను కూలీలు దేహశుద్ధి చేసిన సంఘటన శుక్రవారం చేటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. పాలెం సమీపంలో ఓ రైతు మిర్చి పంటలో కూలీల పనుల కోసం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుంచి కూలీలు వచ్చి పని చేసుకుంటున్నారు. వారి వద్దకు అదే రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులు వచ్చి చోరీ యత్నానికి పాల్పడ్డారు. గమనించిన కూలీలు వారిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. అయితే వారి వద్ద మత్తు మాత్రలు దొరికినట్లు తెలిసింది. దేహశుద్ధి చేసిన యువకులను పోలీసులకు అప్పగించినట్లు గ్రామస్తులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### రూ.21లక్షలతో షెడ్డు నిర్మాణం



**కాళేశ్వరం:** శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో మల్హర్ మండలం తాడిచర్ల ఓపెన్ కాస్టు నిర్వహణ సంస్థ ఏఎమ్మార్ కంపెనీ ఆధ్వర్యంలో రూ.21లక్షలతో షెడ్డు నిర్మాణం చేపట్టింది. ఆలయ రాజగోపురం నుంచి నంది మండపం వరకు షెడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నట్లు ఈఓ మహేష్, చైర్మన్ శ్రీనివాస రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మేడారంలో భక్తులు (ఫైల్)



# నిధులేవీ ?

**సమీపిస్తున్న మేడారం మహా జాతర**
- ఎన్నికల బిజీలో అధికారులు
- అమలులో ఎలక్షన్ కోడ్

**ఎస్ఎస్ తాడ్వాయి:** అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు కావాల్సిన అభివృద్ధి పనుల కోసం నిధులు కావాలని 8నెలల ముందుగానే నివేదిక సమర్పించినా.. ఒక్క పైసా కూడా మంజూరు కాలేదు. దీంతో జాతరలో ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. ప్రస్తుతం ఎలక్షన్ కోడ్ అమలులో ఉండటం.. అధికార యంత్రాంగం ఎన్నికల పనుల్లో బిజీలో ఉండటంతో అటువైపు చూసే నాథుడే లేడు. వచ్చే ఏడాదిలో ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ నుంచి జరిగే మహా జాతరకు ఇంకా నిధులు మంజూరు కాకపోవడంతో ఈ సారి జాతరకు వచ్చే భక్తులకు తిప్పలు తప్పేలా లేవు.

**పనుల్లో జాప్యం తప్పదా..**
మేడారం సమ్మక్క సారలమ్మ జాతర పనుల్లో జాప్యం తప్పేలా లేదు. ఎనిమిది నెలల ముందు నుంచే అధికారులు పనులపై నివేదికలు సమర్పించిన ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. తీరా ఇప్పుడు ఎన్నికల కోడ్ రావడంతో ఈ కోడ్ డిసెంబర్ 5వ తేదీ వరకు కొనసాగనుంది. అ తరువాత ఏ మేరకు నిధులు వస్తాయో లేదో అనే సందిగ్ధం పూజారులు, భక్తుల్లో నెలకొంది. కోట్లాది మంది భక్తులు వచ్చే జాతరకు ఈ లోగా నిధులు మంజూరు చేసిన జాతర నాటికి పనులు పూర్తయ్యేనా లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిధులు మంజూరైన అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కూడా ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నం కావడంతో జాతర పనులపై పర్యవేక్షణ లోపించే ప్రమాదం ఉంది. ఎన్నికల కోడ్ ముగిసినతర్వాత నిధులు మంజూరైతే మిగిలిన రెండు నెలల్లో ఏ మేరకు అభివృద్ధి పనులు అవుతాయోనని భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**ముందుచూపు కరువు..**
మేడారం సమ్మక్క సారలమ్మల జాతరపై ముందుచూపు కరువైంది. ప్రతి రెండేళ్లకొసారి జరిగే మహాజాతరలో ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం అనేక చర్యలు చేపడుతుంది. ప్రతిసారి హడావుడి పనులతో జాతరకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడ్డ సంఘటనలు అనేకంగా ఉన్నాయి. జాతర అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు మళ్లీ వచ్చే జాతరకు ముందస్తు ప్రణాళికతో భక్తులకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తామని హామీ ఇస్తూ కేవలం నివేదికలు తయారీ, సమావేశాలతోనే సమయం గడిపేస్తున్నారు. చివరి ఏదో కారణంగా అధికారులు అనుకున్నంత మేరకు భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారు. అలాగే పనులపై ముందుచూపు కొరవడంతో ఈ సారి కూడా పనులు మమా అనిపించి చేతులు దులుపుకునే పరిస్థితి కనిపిస్తోంది.

**త్వరగా మంజూరు చేయాలి**



మేడారం జాతర అభివృద్ధి పనులకు ప్రభుత్వం త్వరగా నిధులు మంజూరు చేయాలి. ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జరిగే జాతరకు పనులు ముందుగానే చేపడుతారనే ఉద్దేశ్యంతో జాతర తేదీలను ముందుగానే ప్రకటించాం. ఇప్పటి వరకు నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు ఆలస్యం కానున్నాయి. భక్తులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. త్వరగా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలి.

– సిద్దబోయిన జగ్గారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు

బతుకమ్మలతో విద్యార్థులు, మహిళా అధ్యాపకులు



# బతుకమ్మ సందడి



జూనియర్ కళాశాలలో..

ఏటూరునాగారం మండల కేంద్రంలో బతుకమ్మ సందడి నెలకొంది. శుక్రవారం డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. విద్యార్థినులు నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్స్ బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్న, ఉమెన్స్ ఎంపవర్మెంట్ కన్వీనర్ డాక్టర్ బి. రేణుక, వైస్ ప్రిన్సిపాల్ రవీందర్, ఘన్‌సింగ్, స్వామి, ఉమారాణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవద్గీత, అధ్యాపకులు రాజేంద్రప్రసాద్, పవన్ రాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

– ఏటూరునాగారం

**పూల పండుగకు వేళాయె..** నేడు ఎంగిలిపూల పండుగ - వివరాలు IIలో▸

# ఈదురుగాలుల బీభత్సం



రోడ్డుపై ఎగిరిపడిన రేకులు

**ఏటూరునాగారం:** మండల కేంద్రంలోని శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు బీభత్సం సృష్టించింది. భారీగా గాలులు వీచడంతో మండల కేంద్రానికి చెందిన మెర్గు వరప్రసాద్, ఈసం హరికృష్ణకు చెందిన రేకులు ఎగిరిపోయి పక్కన రోడ్డుపై పడ్డాయి. ఇంటిలోని సామగ్రి ధ్వంసం అయ్యాయి. చెట్టు కొమ్మలు విరిగి విద్యుత్ వైర్ల మీద పడడంతో విద్యుత్ ప్రధాన వైర్లు సైతం తెగిపడడంతో ప్రజలు భయంతో పరుగులు తీశారు. కరెంటు వైర్లు నేలపై వాలిపోవడంతో మంటలు వ్యాపించి చల్లారాయి. విద్యుత్ సిబ్బంది సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. వైర్లు పూర్తిగా తెగిపోవడంతో మండల కేంద్రం విద్యుత్ సరఫరా 3 గంటల పాటు నిలిచిపోయింది.

# సమస్యలపై అసెంబ్లీలో కొట్లాడిన

- నియంత పాలనను అంతమొందించాలి
- ఎమ్మెల్యే సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న సీతక్క

**ములుగు రూరల్:** నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో కొట్లాడితేనే పరిష్కరించారని ఏఐసీసీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి సీతక్క అన్నారు. ములుగు మండలం జంగాలపల్లిలోని ఓ గార్డెన్‌లో జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే సీతక్క ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ములుగు జిల్లాను శాశ్వతమైన అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజల కష్టసుఖాల్లో ఉన్నది నేను, ములుగు నియోజక వర్గ ప్రజలే నా కుటుంబం, అందుకే నా కుటుంబంలో చావు అయిన, బతుకు అయిన పెళ్లి అయిన, ఫంక్షన్ అయినా నా కుటుంబ సభ్యులు పిలుస్తున్నారన్నారు. రైతు భరోసా ద్వారా ఉచిత విద్యుత్, రూ. 2 లక్షల రైతు రుణ మాఫీ, ప్రతి ఏటా పట్టాదారులకు రూ.15 వేలు, కౌలు రైతులకు రూ.12 వేలు,ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి వ్యవసాయాన్ని పండుగ చేస్తామన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కూచన రవళి రెడ్డి, మల్లాది రాంరెడ్డి, నారాయణ రెడ్డి, కరంచంద్ గాంధీ, పుష్పలత, గొల్లపల్లి రాజేందర్ గౌడ్, బానోతు రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలే గెలుపునకు నాంది



మంగళహారతితో స్వాగతం పలుకుతున్న మహిళలు

**ములుగు:** సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలే తన గెలుపుకు నాంది అని బీఆర్ఎస్ అభ్యర్థి, జెడ్పీ చైర్‌పర్సన్, బడే నాగజ్యోతి అన్నారు. మొదట గురువారం గట్టమ్మ తల్లి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం నాగజ్యోతి ఓట్ల ప్రచారం నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.. ప్రేమ్‌నగర్, గొల్లవాడ, వీవర్స్ కాలనీల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అందిన ఫలాలను వివరించారు. ఈ సారి ఆశీర్వదించి ఓటు వేస్తే ములుగు నియోజకవర్గాన్ని మరింత ముందుకు నడిపించుకుందామన్నారు. ఆడబిడ్డలు బొట్టు పెట్టి ఆశీర్వదించారు. బతుకమ్మలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కుల పెద్దలు, రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో దివంగత మంత్రి చందూలాల్ కుమారుడు ధరమ్‌సింగ్, మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, ఎంపీటీసీ గొర్రె సమ్మయ్య, నాయకులు రాణాప్రతాప్, సుధీర్, మహేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల వేతనం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

**ములుగు రూరల్:** పాఠశాలల్లో అమలు చేసే అల్పాహారం పథకానికి అదనంగా వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ అనుబంధం తెలంగాణ మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ సభ్యులు గున్నాల రాజకుమారి అన్నారు. శుక్రవారం జరిగిన సమావేశానికి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలల్లో వంట కార్మికులుగా 22 సంవత్సరాలుగా వంటలు చేస్తూ, విద్యార్థులకు నాణ్యమైన భోజన అందిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు అందించే వేతనాన్ని పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బండి నర్సయ్య, జేరిపోతుల పైడిబాబు, కార్మికులు గున్నాల రాజకుమారి, రాపర్తి ఉమాదేవి, ఆలోతు కౌసల్య, బాలసాని ఇందిర కొంకరెక్కల నవలోక కుక్కల లక్ష్మీ, పద్మ, సారమ్మ, రాధ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ‘పొన్నాల’ కలకలం!

**టికెట్ రావడం లేదనే సంకేతాల మేరకే రాజీనామా**
- 16న జనగామలో జరిగే సీఎం సభలో బీఆర్ఎస్‌లో చేరతారనే ప్రచారం..
- లక్ష్మయ్య రాజీనామాపై భిన్నాభిప్రాయాలు.. సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ
- వేచిచూసే ధోరణిలో మరికొందరు నేతలు
- అసంతృప్తి నేతలకు టచ్‌లోకి టీపీసీసీ పెద్దలు..తొందరపడొద్దని ఫోన్‌లో సంప్రదింపులు
- హస్తం పార్టీలో ‘పొన్నాల’ ప్రస్థానం ముగిసినట్టేనా..?

**సాక్షిప్రతినిధి, వరంగల్:** టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య రాజీనామా కాంగ్రెస్ పార్టీలో కలకలం రేపుతోంది. సుమారు 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ఆయనకు ఏఐసీసీ పెద్దలు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదనే ఆవేదనతో రాజీనామా లేఖాస్త్రం సంధించడంపై ఉమ్మడి వరంగల్ జిల్లాలో విస్తృతమైన చర్చ జరుగుతోంది. జనగామ డీసీసీ అధ్యక్షుడిగా కొమ్మూరి ప్రతాపరెడ్డిని నియామకాన్ని మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న పొన్నాలకు.. పార్టీ టికెట్ కూడా రావడం లేదనే సంకేతాల నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నారన్న చర్చ కూడా ఉంది. మరోవైపు ఆయన రాజీనామాపై రాజకీయ విశ్లేషకుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కొక్కరు ఒక్కో విధంగా స్పందిస్తున్న విషయాలు స్థానికంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బీసీ నేతగా అంచెలంచెలుగా ఎదిగి పార్టీ కోసం అంకిత భావంతో టీపీసీసీ స్థాయికి ఎదిగిన తనకే విలువ లేకపోతే.. సాధారణ బీసీ నాయకుల పరిస్థితి ఏంటని ఆయన ఏఐసీసీ అధ్యక్షుడు మలికార్జున్ ఖర్గేకు పంపిన లేఖలో ఆవేదన వ్యక్తం చేయడంపై సానుకూలత ఉంది. అవమానం భరించలేక 45 ఏళ్ల తర్వాత ఈ నిర్ణయం తీసుకోవడం బాధ కలిగిస్తుందని కూడా పేర్కొనడంపైన పాజిటివ్ ఉంది. అయితే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం కోసం సర్వేలు, ఏఐసీసీ పరిశీలనల ఆధారంగా తీసుకునే నిర్ణయాలకు సీనియర్లు ఎందుకు కట్టుబడి ఉండరన్న చర్చ కూడా ఉంది. ఏమీ కాలేని నేతలు కాంగ్రెస్ పార్టీ నీడలో ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్టీ పదవులను అనుభవించి పార్టీ మేలు కోసం తగ్గితే తప్పేమిటన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. కాగా ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్‌పై పొన్నాల లక్ష్మయ్య రాజీనామా ప్రభావం చూపి.. మరికొందరు టికెట్ రాదని భావించే నాయకులు పార్టీని వీడకుండా టీపీసీసీ చర్యలు చేపడుతోంది. అసంతృప్తి నేతలతో సంప్రదింపులు జరిపి చక్కదిద్దే పనిలో పడింది.

**టికెట్ రావడం లేదనే సంకేతం..**
తెలంగాణకు తొలి టీపీసీసీ అధ్యక్షుడిగా 119 స్థానాలకు టికెట్ల ఖరారులో కీలకంగా వ్యవహరించిన పొన్నాల లక్ష్మయ్యను.. తనకే టికెట్ రావడం లేదన్న సంకేతాలు ఆవేదనకు గురిచేశాయని ఆయన అనుచరులు చెబుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 12 సంవత్సరాలు మంత్రిగా, తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పనుల కేటాయింపు మొదలు పార్టీ కార్యకలాపాల్లో ‘కింగ్‌మేకర్’గా ఉన్న ఆయనకు కొద్ది రోజులు ఏఐసీసీ పెద్దలు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. మంత్రిగా, టీపీసీసీ చీఫ్‌గా ఉమ్మడి వరంగల్‌లో 1999 నుంచి 2014 వరకు ఓ వెలుగు వెలిగిన ఆయన గ్రాఫ్ 2016 తర్వాత పార్టీలో పడిపోయింది. ఏఐసీసీతో సైతం గ్యాప్ పెరగడంతోపాటు ఆయన నియోజకవర్గం జనగామకు కొత్త అభ్యర్థులు తెరమీదకు రావడాన్ని కూడా జీర్ణించుకోలేకపోయారు. తాను ఎంత వ్యతిరేకించినా.. కొమ్మూరి ప్రతాపరెడ్డిని డీసీసీ అధ్యక్షుడిని చేయడం మొదలు ఇవన్నీ తనకు టికెట్ రాకుండా చేయడమేనన్న సంకేతాలు అయనకున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన తర్వాత చివరి ప్రయత్నంగా ఏఐసీసీ పెద్దలను కలిసే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో రాజీనామాకు సిద్ధమైన పొన్నాల లక్ష్మయ్య.. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, పార్టీ వ్యూహకర్త సునిల్‌లపై ఘాటైన వ్యాఖ్యలు చేస్తూ ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గేకు రాజీనామా లేఖను పంపడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే పొన్నాల లక్ష్మయ్య.. త్వరలోనే బీఆర్ఎస్ గూటికి చేరతారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నెల 16న జనగామలో సీఎం కేసీఆర్ సభ సందర్భంగా ఈ చేరిక ఉంటుందంటున్నారు. లేదంటే అంతకంటే ముందే మంత్రి కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరవచ్చని అంటున్నారు.



**కాంగ్రెస్‌లో 12 ఏళ్ల ప్రస్థానం..**
నాలుగున్నర దశాబ్దాలు, నలుగురు ముఖ్యమంత్రుల హయాంలో సుమారు 12 ఏళ్లపాటు రాష్ట్ర మంత్రిగా వివిధ శాఖలు నిర్వహించారు. ముఖ్యమంత్రులుగా పనిచేసిన నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, డా.వైఎస్ రాజశేఖరరెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డిల మంత్రివర్గంలో వివిధ శాఖలకు మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత తొలి టీపీసీసీ అధ్యక్షుడిగా 2014 మార్చి 10న పొన్నాల లక్ష్మయ్య పార్టీ కీలక పదవిని చేపట్టారు.
ఏడు పర్యాయాలు జనగామ నుంచి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన లక్ష్మయ్య నాలుగు సార్లు గెలుపొందారు. 1985లో సీపీఎం అభ్యర్థి అసిరెడ్డి నరసింహారెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత 1989లో జరిగిన ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి చురగొండి రాజిరెడ్డిపై గెలిచిన పొన్నాల.. 1994 అసెంబ్లీ ఎన్నికల్లో అదే చురగొండి రాజిరెడ్డిపై ఓటమి చెందారు. 1999లో ప్రేమలతారెడ్డి (టీడీపీ), 2004లో ఎ.బస్వారెడ్డి (టీడీపీ), 2009లో కొమ్మూరి ప్రతాపరెడ్డి (టీఆర్ఎస్ (బీఆర్ఎస్))లపై పొన్నాల గెలిచి హ్యాట్రిక్ కొట్టారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రంలో 2014, 2018లలో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి చేతిలో ఓటమి చెందారు. కాగా, పొన్నాల లక్ష్మయ్య రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్ పార్టీలో ముగిసినట్లేనా అన్న చర్చ జరుగుతోంది. ఆయన రాజీనామాను ఆమోదిస్తే ముగిసినట్లేనని, పెద్దలు విస్తృత సంప్రదింపులు జరిపితే ఆయన మెత్తబడి తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే అవకాశం లేకపోలేదన్న వాదన వినిపిస్తోంది.

# ఏటూరునాగారం డివిజన్‌లోనే ఉంచాలి

**ఆదివాసీ విద్యార్థి సంఘం డిమాండ్**



మాట్లాడుతున్న కొప్పుల రవి

**ఎస్ఎస్‌తాడ్వాయి:** ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్‌లోనే తాడ్వాయి మండలాన్ని ఉంచాలని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి జిల్లా అధికారులను కోరారు. శుక్రవారం మండలంలోని మేడారంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పులిసే బాలకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడ్వాయి మండలాన్ని ఏటూరునాగారం డివిజన్‌కు కేటాయించడం సరైనదన్నారు. తాడ్వాయి మండలం ఏటూరునాగారం డివిజన్‌కు చాలా దగ్గరగా ఉంటుందన్నారు. దీన్ని ఇంకా అభివృద్ధి చేయాల్సింది పోయి కుట్రపూరితంగా వివిధ పార్టీలు మారుతూ రాజకీయ ఊసరవెల్లిగా మారిన ఓ బీఆర్ఎస్ నాయకుడు గిరిజనేతరుల మధ్య అగాధాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తునారని, ఈ ప్రయత్నాలను వెంటనే మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్నెబెల్లి గణేశ్, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పొడెం శోభన్, మండల అధ్యక్షుడు కొప్పుల పాల్గొన్నారు.

# భూపాలపల్లి ఎస్పీగా కిరణ్ ఖారే



ఎస్పీ కిరణ్ ఖారే

**భూపాలపల్లి రూరల్:** భూపాలపల్లి ఎస్పీగా కిరణ్ ఖారే నియమితులుగా కాగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన కిరణ్ ఖారే హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని సౌత్, వెస్ట్ జోన్ డీసీపీగా విధులు నిర్వర్తించారు. బదిలీల్లో భాగంగా జిల్లాకు ఎస్పీగా వచ్చారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకున్న ఎస్పీ సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి విధుల్లో చేరారు. అనంతరం ఎస్పీ కిరణ్ ఖారే మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

## క్లుప్తంగా

### ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు

● వర్ధన్నపేట ఎమ్మెల్యే రమేశ్‌పై ఈసీకి ఫిర్యాదు


రావూరులో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ప్రచారరథం(ఫైల్)

సాక్షి వరంగల్: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఓటర్లను ప్రభావితం చేసేందుకు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్.. ఒక బ్యాగ్, స్టీలు టిఫిన్, స్టీలు వాటర్ బాటిల్ కలిపి ఓ కిట్‌లో ఉంచి వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామంలో అర్ధరాత్రి తన అనుయాయులతో పలువురు ఇళ్ల వద్ద పెట్టించారని కాంగ్రెస్ సీనియర్ నేత బక్క జడ్సన్ శుక్రవారం ఈసీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ ప్రజలు తెల్లవారుజామున లేచి చూసే సరికి ఎమ్మెల్యే ఫొటోతో కూడిన పింక్ కలర్ గిఫ్ట్ కిట్ బ్యాగులను చూసి షాక్ అయ్యారని పేర్కొన్నారు. అంతేకాకుండా పర్వతగిరి మండలం మున్నూరు కాపు కుల సంఘం నాకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసి వర్ధన్నపేట నియోజవర్గం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా మూడోసారి భారీ మెజార్టీతో గెలిపిస్తున్నట్లుగా ఈ నెల 10వ తేదీన తన ట్విట్టర్‌లో కూడా పోస్టు చేశారన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ ఎన్నికల కోసం ఓటర్లకు లంచం ఇవ్వడం, బహుమతులు, ఉచిత మద్యం, కులాల వారీగా విరాళాలు ఇస్తున్నాడని, ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన నేపథ్యంలో ఎమ్మెల్యేపై తదనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరినట్లు జడ్సన్ తెలిపారు.

### అనుమతిలేని ఎన్నికల ప్రచారంపై నోటీసులు

వర్ధన్నపేట: వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరి మండలం రావూరు, కల్లెడ గ్రామాల్లో ఈ నెల 11న రాత్రి బీఆర్ఎస్ ప్రచార రథం ఎలాంటి అనుమతులు లేకుండా ప్రచారం చేసినట్లు ఫిర్యాదు అందగా శుక్రవారం ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు సంజాయిషీ నోటీసును అందచేసినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అశ్విని తానాజీ వాకడే తెలిపారు. మండలంలోని దమ్మన్నపేటలో శుక్రవారం తెల్లవారు జామున బీఆర్ఎస్ పార్టీ గుర్తు, ఎమ్మెల్యే అరూరి రమేష్ ఫొటో కలిగిన టిఫిన్ బాక్స్‌లు పంపిణీ చేస్తున్నారని ఫిర్యాదు అందగా గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టామని, కానీ, అవి గతంలో ఇచ్చిన టిఫిన్ బాక్స్‌లేనని ప్రస్తుతం ఇచ్చినట్లుగా ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు.



# పూల పండుగకు వేళాయె..

**నేడు ఎంగిలి పూల బతుకమ్మ**
● 22న సద్దుల బతుకమ్మ
● వేడుకలకు సిద్ధమైన మహిళలు



హనుమకొండ, వరంగల్‌లో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

తెలంగాణ ఆడబిడ్డల పండుగ బతుకమ్మ రానేవచ్చింది. అశ్వయుజ శుద్ధపాడ్యమికి ముందు వచ్చే అమావాస్య(పెత్రమాస)రోజున ఎంగిలిపూల బతుకమ్మగా ప్రారంభమై.. సద్దుల బతుకమ్మతో ముగిసే అద్భుత వేడుక ఇది. తొమ్మిదిరోజులపాటు ఆడబిడ్డలతో చెలిమిజేసి, యువతుల చేతుల్లో ఊయలలూగి గంగఒడికి చేరుతుంది బతుకమ్మగా పిలిచే గౌరమ్మ. తీరొక్కపూలను అపురూపంగా పేర్చి.. ఆడిపాడేందుకు ఇప్పటికే ఆడబిడ్డలు మెట్టినింటినుంచి పుట్టింటికి చేరారు. దీంతో పల్లెలన్నీ పండుగ వాతావరణాన్ని సంతరించుకుని పూల పండుగకు సిద్ధమయ్యాయి.

### నేడు వేయిస్తంభాల దేవాలయంలో బతుకమ్మ సంబురాలు



చారిత్రాత్మక రుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో శనివారం ఎంగిలిపూవు బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ వెంకటయ్య శుక్రవారం తెలిపారు. సాయంత్రం వేలాదిమంది మహిళలు బతుకమ్మలతో హాజరు కానున్న నేపథ్యంలో లైటింగ్, మైక్‌సెట్లు ఏర్పాటు చేస్తున్నామని, మహిళలు ప్రశాంతంగా బతుకమ్మ పండుగను జరుపుకోవాలని కోరారు.

హన్మకొండ కల్చరల్ : పెత్రమాస రోజున పేర్చే మొదటిరోజు బతుకమ్మతో వేడుకలు ప్రారంభం అవుతాయి. దీనినే ఎంగిలి పూవు బతుకమ్మగా పిలుస్తారు. అయితే తొమ్మిది రోజులపాటు బతుకమ్మను పేర్చి సంప్రదాయ పాటను పాడి నీటిలో నిమజ్జనం చేస్తారు. ఆరో రోజున పూలను సేకరించకుండా ఉంటారు. దీనినే అర్రెం అని పిలుస్తారు. తీరొక్కపూలను ముందురోజు తెచ్చి ఒకరోజు నిద్ర చేసిన పూలతో బతుకమ్మను పేర్చడం వల్ల ఎంగిలి పూల బతుకమ్మ అని పిలుస్తారని పరిశోధకుల అభిప్రాయం. కుటుంబంలో చనిపోయిన పెద్దలకు పెత్రమాస రోజున నివేదనలు చేసి భోజనం అనంతరం బతుకమ్మను పేర్చడం వల్ల కూడా ఎంగిలి పూవు బతుకమ్మగా పిలుస్తారని ప్ర చారం. వెదురు సిబ్బి, దుస్సెరు తీగతో అల్లిన సిబ్బిలో ముందుగా గుమ్మడి ఆకులు పరిచి దానిపై పూలతో వరుసలుగా బతుకమ్మను పేర్చడం ఆనవాయితీ. తొలిరోజు గ్రామంలోని ఆలయాల్లో బతుకమ్మను ఆడుకుంటారు. రెండోరోజు నుంచి ఒక్కోచోట బతుకమ్మలను ఉంచి ఆడుతారు. ఆరోరోజు అర్రెంగా భావించి బతుకమ్మను ఆడరు. ఈక్రమంలో నేడు (శనివారం) పితరుల/ పితృ అమావాస్య సందర్భంగా చనిపోయిన తమ ఇంటి పెద్దలకు ఆత్మశాంతి జరగాలని బ్రాహ్మణులకు బియ్యం ఇస్తారు.


బతుకమ్మతో మహిళలు

**పూల కొనుగోళ్లతో రద్దీ..**

శనివారం ఎంగిలి పూవు బతుకమ్మను పేర్చడానికి కావల్సిన పూలశిబ్బిలు, రంగులు, తంగేడుపూలు, గునుగు, తామర పూలు, చామంతి, బంతి, సీతజడ పూలు మొదలైనవి కొనుగోలు చేయడానికి వచ్చిన వారితో శుక్రవారం ఉదయం నుంచే నగరంలోని రోడ్లు కిక్కిరిసిపోయాయి. వరంగల్‌లోని హెడ్ పోస్టాఫీస్, పిన్నవారి వీధి, రామన్నపేట, బట్టలబజార్, కాశిబుగ్గ, గోపాలస్వామి గుడి, హనుమకొండ చౌరస్తా, కుమార్‌పల్లి, టైలర్‌స్ట్రీట్, అంబేద్కర్ సెంటర్, సుబేదారి, కాజీపేటలోని బాపూజీ నగర్ తదితర ప్రాంతాల్లో పూల విక్రయాలు, కొనుగోళ్లు జోరుగాసాగాయి.

### బతుకమ్మను పూజిస్తే ఆనందం..



సంస్కృతిని, సంప్రదాయాన్ని చాటే విధంగా తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను పూజిస్తే ఎంతో ఆనందం అనిపిస్తుంది. ఆడబిడ్డలకు ఆప్యాయత, ప్రేమానురాగాల్ని పంచే పండుగే బతుకమ్మ. ఆడబిడ్డలందరు పుట్టింటికి చేరుకొని మధుర జ్ఞాపకాలు, కష్టసుఖాలు పంచుకుంటూ బతుకమ్మను సంబురంగా జరుపుకుంటాం.

– ఇంజారపు పూజ (ఎస్సీ), పీటీసీ ప్రిన్సిపాల్

### వరంగల్‌లో పండుగ ప్రత్యేకం



పెళ్లి.. ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటాను. నా చిన్నతనంలో స్కూల్ సెలవులు రాగానే మా కుటుంబసభ్యులందరం అమ్మమ్మ ఇంటికి వెళ్లేవాళ్లం. మొదటిరోజు నుంచి సద్దుల బతుకమ్మ వరకు ఆనందంగా గడుపుతాం. వరంగల్‌లో జరిగే బతుకమ్మ పండుగ వైభవాన్ని, సద్దుల ఫలహారాల గురించి మా సహోద్యోగులకు చెపుతుంటాను.

– బొల్లోజు నైమిష, సాఫ్ట్‌వేర్, కాశిబుగ్గ, వరంగల్

### మాకు సంప్రదాయంగా నిలిచిపోయింది



గత 50 సంవత్సరాల నుంచి మా ఇంటి ఎదుట బొడ్డెమ్మను ప్రతిష్ఠించడం ఆనవాయితీ. బొడ్డెమ్మను చెరువులో నిమజ్జనం చేసిన మరుసటిరోజు ఎంగిలి పూల బతుకమ్మ ప్రారంభిస్తాం. రోజుకో రకంగా ప్రసాదం చేసి పంచుకుంటాం. ముందు తరాలకు పండుగలు, సంప్రదాయాలు తెలియజేయాలి.

– సాంబరాజు కల్యాణి, గృహిణి, రజకవీధి, హనుమకొండ

### వాహనాల తనిఖీలో నగదు స్వాధీనం


భూపతిపేట చెక్‌పోస్టు వద్ద డబ్బులు చూపిస్తున్న డ్రైవర్

గూడూరు: మండలంలోని భూపతిపేట ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద శుక్రవారం చేపట్టిన పోలీసుల తనిఖీలో ఓ కారు డ్రైవర్ వద్ద ఉన్న నగదును సీజ్ చేసినట్లు ఎస్సై రాణాప్రతాప్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిర్వహిస్తున్న చెక్‌పోస్టు వద్ద వరంగల్ నుంచి వస్తున్న మారుతి ఈకో కారు చెక్ చేయగా, డ్రైవర్ నాగేశ్వర్‌రావు వద్ద రూ.1,10,000 ఉన్నాయి. దీంతో నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రెయినీ ఎస్సై వంశీకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### 16 నుంచి సైన్స్ వారోత్సవాలు

కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్ రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో సైన్స్ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు శుక్రవారం సైన్స్ సెంటర్ అధికారి నితీశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు సైన్స్ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు వివిధ సైన్స్ కార్యక్రమాలు, పోటీలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. వివరాలకు 96766 75770, 98494 89754, 0870-2431995 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీరభద్రవరం గ్రామ సమీపంలో మిర్చి తోటలో కూలి పనులకు వచ్చిన ఛత్తీస్‌గఢ్ యువకుడు శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా, రామ్‌పేట గ్రామానికి చెందిన కొమరం లోకేష్ (20) తన కుటుంబ సభ్యులతో కలిసి కూలి పనులకు రెండు నెలల క్రితం వీరభద్రవరం వచ్చారు. ఈక్రమంలో యువకుడు మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. కాగా, గురువారం రాత్రి మద్యం మత్తులో కుటుంబ సభ్యులతో గొడవ పడి.. తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వెంకటాపురం ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

**తండ్రి ఆస్తి పంచి ఇవ్వడం లేదని..**


బానోత్ హరి (ఫైల్)

గార్ల: తండ్రి ఆస్తి పంచి ఇవ్వడం లేదని కొడుకు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం మానుకోట జిల్లా గార్ల మండలం తిర్లాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిర్లాపురానికి చెందిన బానోత్ హరి(40) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతని తండ్రి తారాచంద్ ప్రస్తుతం ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా, హరి తల్లి చనిపోవడంతో తండ్రి రెండో వివాహం చేసుకున్నాడు. దీంతో హరి నానమ్మ వద్ద పెరిగాడు. హరికి భార్య సరిత ఇద్దరు సంతానం ఉన్నారు. హరి కుమారుడు తలసేమియా వ్యాధితో బాధపడుతుండగా.. కూలీ పనిచేస్తూ.. కుమారుడి వైద్యం కోసం నెలకు రూ.15,000ఖర్చు చేయలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో తండ్రిని ఆస్తి పంచి ఇవ్వమని కోరగా.. ఇవ్వడం లేదు. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించారు. భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బానోత్ వెంకన్న తెలిపారు.

# సమాజాభివృద్ధికి యువత నడుంబిగించాలి

● హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్


సభలో మాట్లాడుతున్న చంద్రకుమార్

నెహ్రూసెంటర్: సమాజాభివృద్ధి, నవ భారత నిర్మాణానికి యువత నడుంబిగించాలని, శాస్త్రీయ దృక్పథంతో ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన పీవైఎల్ రాష్ట్ర 8వ మహాసభ ప్రతినిధుల సభలో రాష్ట్ర అధ్యక్షుడు కె.కాశీనాథ్ సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. సమాజంపై బాధ్యతయుతమైన ఆలోచనలతో, ప్రజాస్వామిక దృక్పథం కలిగిన పౌరులే నిజమైన దేశభక్తులని అన్నారు. దేశంలో అన్ని రంగాల్లో ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని వాటిని భర్తీ చేయకుండా ప్రభుత్వాలు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని ఆరోపించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో విద్యకు 25 శాతం నిధులు కేటాయిస్తే మన దేశంలో కేవలం 6.5 శాతం కేటాయించి చేతులు దులుపుకుంటున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు శాస్త్ర సాంకేతిక రంగాల వైపు యువతను ప్రోత్సహిస్తుంటే మన దేశంలో యువత కులం, మతం, సనాతన ధర్మం అంటూ తిరోగమనం వైపు నెట్టివేయబడుతున్నారని మండిపడ్డారు. అనంతరం మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. అధికారం కోసం పాలకవర్గాలు హామీలను గుప్పిస్తున్నాయని కేసీఆర్, మోదీ గారడీ మాటలను నమ్మొద్దని సూచించారు. సమాజ మార్పుకోసం జరిగే ప్రజాపోరాటాల్లో యువతరం ముందుండాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పనకై ప్రగతిశీల యువత నిరంతరం ఉద్యమించాలని కోరారు. మహాసభలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ ప్రదీప్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న, టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌రాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్, పీవైఎల్ రాష్ట్ర నాయకులు ఎన్‌వీ రాకేష్, వాంకుడోత్ అజయ్, యాకయ్య, రంగయ్య, అనిల్, రవి, వెంకటేశ్వర్లు, వీరన్న, సూర్యం, సత్యం, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం మహాసభలో పలు తీర్మానాలను ప్రవేశపెట్టి, ఆమోదించారు.

# ముగ్గురు గంజాయి స్మగ్లర్ల అరెస్టు


వరంగల్ క్రైం: వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం: నగరంలో శుక్రవారం జరిపిన తనిఖీల్లో గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న రెండు ముఠాల్లోని ముగ్గురిని ఇంతేజార్ గంజ్, మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్టు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి తెలిపారు. వీరి నుంచి సుమారు రూ.10లక్షల విలువ చేసే 50కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒడిషా రాష్ట్రానికి చెందిన జస్కర్ మెహెర్, మోహన్ చలన్, జ్యోతి ప్రకాశ్ దలాయిలను అరెస్టు చేసినట్లు తెలిపారు. ముఠా సభ్యులు ఆంధ్ర, ఒడిషా సరిహద్దుల్లో రెండు వేర్వేరు ప్రాంతాల్లో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి ఎక్కువ ధరకు హైదరాబాద్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో విక్రయించేందుకు వేర్వేరు రైళ్లలో బయలుదేరారు. అయితే వీరు ప్రయాణిస్తున్న మార్గాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నట్లుగా తెలుసుకుని గంజాయిని వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో విక్రయించాలనుకున్నారు. ఈక్రమంలో జ్యోతి ప్రకాశ్ పోలీసులకు అనుమానం రాకుండా భువనేశ్వర్ నుంచి వచ్చిన రైలులో కాకుండా, మరో రైలులో హైదరాబాద్‌కు వెళ్లేందుకు వరంగల్‌లో దిగి రైల్వే స్టేషన్ వద్ద ఉన్నాడు. అదేసమయంలో మరోఇద్దరు నిందితులు శివనగర్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ పోలీసులు తనిఖీ చేశారు. దీంతో జ్యోతి ప్రకాశ్ వద్ద 17కిలోలు గంజాయి, మెహెర్, మొహన్ చలన్ వద్ద 33 కిలోల గంజాయిని మిల్స్‌కాలనీ పోలీసులు స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు డీసీపీ బారి వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, సురేష్, ఎస్సైలు సాయి ప్రసన్నకుమార్, వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ రవీందర్ రెడ్డి, శివకృష్ణ, ఉపేంద్, ఆర్‌పీఎఫ్ సిబ్బందిని డీసీపీ అభినందించారు.

**గంజాయి స్వాధీనం**

మహబూబాబాద్ రూరల్ : ఎన్నికల తనిఖీల్లో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల్లో తనిఖీలు చేస్తుండగా రూ.3.75 లక్షల విలువగల 15 కిలోల ఎండు గంజాయి పట్టుబడిందని డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్లో శుక్రవారం ఆయన కేసు వివరాలు వెల్లడించారు. టౌన్ ఎస్సై వి.విజయరాంకుమార్ తన సిబ్బందితో తనిఖీలు చేస్తున్న క్రమంలో శ్రీనివాస టాకీస్ సెంటర్లో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా వారిని ఆపి విచారించారు. వారి వద్ద బ్యాగును పరిశీలించగా 15కిలోల ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఒరిస్సాలోని గంజాం జిల్లాకు చెందిన శుభంకుమార్ గౌడ్, చిన్మయ స్వేన్ గంజాయిని విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు విచారణలో చెప్పారని పోలీసులు తెలిపారు. సమావేశంలో టౌన్ సీఐ సతీష్, ఎస్సై విజయరాంకుమార్, హెడ్ కానిస్టేబుల్ మన్సూర్ అలీ, పీసీలు గౌతం, వీరన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


యాకన్న

కొడకండ్ల: చేపల వేటకు వెళ్లిన యువకుడు మృతి చెందిన సంఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండలకేంద్ర శివారులో శుక్రవారం చోటు చేసుకొంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం మామిడాల గ్రామానికి చెందిన కొండ యాకన్న తల్లిదండ్రులు మృతి చెందడంతో మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం కొరిపెల్లిలోని తన అక్కబావ ఇంట్లో ఉంటూ ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామానికి చెందిన కొంతమంది కొడకండ్ల మండల కేంద్రం శివారులోని చెక్‌డ్యాం వద్ద చేపలు పట్టేందుకు వెళ్తుండగా యాకన్న వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి యాకన్న నీటిలో పడి మృతి చెందాడు. యాకన్న అక్క కసరబోయిన మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

### రామప్పలో ముగిసిన క్యాంపెయిన్



సమావేశంలో మాట్లాడుతున్న శైలజ రామయ్యర్

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని రామప్పలో 12 రోజులుగా జరుగుతున్న వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ క్యాంపెయిన్ శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమానికి టూరిజం ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కలెక్టర్ ఇలా త్రిపాఠి హాజరై మాట్లాడారు. ఈనెల 2 నుంచి 13 వరకు కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఆధ్వర్యంలో వలంటీర్లకు శిక్షణ ఇవ్వడమే కాకుండా పర్యాటక ప్రదేశాలను సందర్శించి వాటి ప్రాముఖ్యతను తెలియజేసినట్లు పేర్కొన్నారు. రామప్పలో గతేడాది నుంచి క్యాంపెయిన్ ప్రోగ్రాం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన 35మంది వలంటీర్లకు మెమోంటో అందజేశారు. అంతకు ముందు రామప్ప దేవాలయంలో వారు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు శ్రీధర్‌రావు, టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, పురావస్తుశాఖ జిల్లా అధికారి మల్లేశం, టూరిజం జిల్లా అధికారి శివాజీ, పురావస్తుశాఖ డిప్యూటీ డైరెక్టర్ నారాయణరావు, అసిస్టెంట్ డైరెక్టర్ మల్లునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టు కొరియర్ల అరెస్ట్


కొరియర్లను చూపుతున్న పోలీసులు

వాజేడు: నలుగురు మావోయిస్టు కొరియర్లను గురువారం అరెస్ట్ చేసినట్లు వెంకటపురం(కె) సీఐ బండారు కుమార్ తెలిపారు. వాజేడు పోలీస్ స్టేషన్ శుక్రవారం వాజేడు ఎస్సై వెంకటేశ్వర్ రావుతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. వాజేడు మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్‌లో గురువారం వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో ఏటూరునాగారం వైపు నుంచి రెండు ద్విచక్రవాహనాలపై వచ్చిన నలుగురు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని తనిఖీ చేయగా.. వారి వద్ద నాలుగు సంచుల్లో 8 జిలెటిన్ స్టిక్స్, 10 విప్లవ సాహిత్యం పుస్తకాలు గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తీగారం గ్రామానికి చెందిన కదారి యాదగిరి, కాలకోట ప్రభాకర్, శివరాత్రి పవన్ కల్యాణ్, ఎల్మకంటి మహేష్‌గా గుర్తించినట్లు తెలిపారు. కదారి యాదగిరి, కాలకోట ప్రభాకర్ గత 20, 25 సంవత్సరాల క్రితం పీపుల్స్ వార్ గ్రూపులో దళ సభ్యులుగా పని చేయగా వారిని పోలీసులు అరెస్టు చేసి, జైలుకు పంపించినట్లు తెలిపారు. జైలు నుంచి విడుదలైన వీరు కొంత కాలంగా మావోయిస్టు అగ్రనాయకులైన బడె చొక్కారావు అలియాస్ దామోదర్‌కు కొరియర్లుగా పని చేస్తున్నట్లు తెలిపారు. దామోదర్ మరి కొంతమంది మావోయిస్టు దళ సభ్యుల ఆదేశాల మేరకు పార్టీలో చేరడానికి ఆసక్తిగల కొత్త వ్యక్తులైన శివరాత్రుల పవన్ కల్యాణ్, ఎలమకంటి మహేష్‌ను తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

# విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

● గురుకుల సంస్థల డిప్యూటీ కార్యదర్శి వెంకటలక్ష్మి


బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

చెన్నూర్: విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ డిప్యూటీ కార్యదర్శి డి.వెంకటలక్ష్మి అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో శుక్రవారం ఆమె తహసీల్దార్ ఈర్ల మల్లికార్జున్‌తో కలిసి 9వ జోనల్ స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఆర్సీఓ స్వరూపారాణి జ్యోతిప్రజ్వలన చేశారు. పోటీల్లో కాళేశ్వరం జోన్–1 పరిధిలోని జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 15 పాఠశాలల నుంచి 1,275 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

**పరుగుపందెంలో విజేతలు వీరే..**

పరుగు పోటీలను ముఖ్య అతిథులు ప్రారంభించారు. అండర్–14 విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో ఎం.అలేఖ్య(లక్సెట్టిపేట) ప్రథమ, వేదంశికం(ములుగు) ద్వితీయ, టి.లక్ష్మి(సిర్పూర్) తృతీయ, అండర్–17లో మూడు కిలోమీటర్ల పరుగుపందెం పోటీల్లో డి.రాణి(చిట్యాల) ప్రథమ, ఏ.ఆశ్రిత(లక్సెటిపేట) ద్వితీయ, ఎం.మౌనిక(ములుగు) తృతీయ, అండర్–19లో ఏ.అర్చన(నంది మేడారం) ప్రథమ, మయూరి(మందమర్రి) ద్వితీయ, పి.పూజిత(కాగజ్‌నగర్) తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బంగారు, వెండి, కాంస్య పతకాలను ముఖ్య అతిథులు అందజేశారు.

# ఎస్సార్‌లో ఎడ్యుకేషన్ యూఎస్ఏ ఫేర్–2023


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ దీపక్ గార్గ్

హసన్‌పర్తి: మండలంలోని అన్నాసాగరం సమీపంలోని ఎస్సార్ యూనివర్సిటీలో ఎడ్యుకేషన్ యూఎస్ఏ ఫేర్–2023 కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. యూఎస్‌లో ఉన్న 15 యూనివర్సిటీలు ఈ ప్రోగ్రాంలో పాల్గొన్నాయి. యూఎస్ఏలో అభ్యసించడానికి ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థులు ఈకార్యక్రమంలో పాల్గొని, తమ సందేహాలు నివృత్తి చేసుకున్నారు. యూఎస్ హైయర్ ఎడ్యుకేషన్ వారు అందిస్తున్న సమాచారంతో కూడిన ఉన్నత విద్య అవకాశాలను విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. బీ.ఎస్, ఎం.ఎస్, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్ ప్రోగ్రాం గురించి తెలుసుకున్నారు. ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ.. ఈ ఫేర్ ద్వారా యూఎస్ యూనివర్సిటీల్లో అందిస్తున్న విద్యా విధానం గురించి ఇక్కడి విద్యార్థులు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఈ సమాచారం అక్కడి యూనివర్సిటీల్లో విద్యార్థుల ఎంపికకు ఉపకరిస్తుందని తెలిపారు. ఎస్సార్ యూనివర్సిటీ ఇంటర్నేషన్ అపార్చునిటీస్, కార్పొరేట్ ఔట్ రీచ్ మేనేజర్ ప్రీతా చక్రవర్తి మాట్లాడుతూ.. యూఎస్ విద్యావకాశాలపై పూర్తి అవగాహనతోపాటు విద్యార్థులకు విలువైన సమాచారం అందుతోందన్నారు. కార్యక్రమంలో ఎస్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి, డీన్ గురురావు, డాక్టర్ మహేష్, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# నీట్‌-యూజీ సిలబస్‌ కుదింపు

**నూతన సిలబస్‌ను విడుదల చేసిన ఎన్‌ఎంసీ**

- విద్యార్థులపై భారం తగ్గించడమే లక్ష్యం
- కెమిస్ట్రీలో 20 శాతం సిలబస్‌ కట్‌...
- ఫిజిక్స్‌లో కష్టమైన కాన్సెప్ట్‌లూ తగ్గింపు

**సాక్షి, హైదరాబాద్‌:** ఎంబీబీఎస్, బీడీఎస్‌ వంటి మెడికల్‌ కోర్సుల్లో ప్రవేశాలకు 2024 నుంచి నిర్వహించే నేషనల్‌ ఎలిజిబిలిటీ కమ్‌ ఎంట్రన్స్‌ టెస్ట్‌ (నీట్‌) సిలబస్‌ను కుదించారు. విద్యార్థులపై భారం తగ్గించేందుకు జాతీయ మెడికల్‌ కమిషన్‌ (ఎన్‌ఎంసీ) ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సిలబస్‌లో స్వల్ప మార్పులు చేసింది. కెమిస్ట్రీలో అత్యధికంగా టాపిక్‌లు తగ్గించారు. మొత్తంగా కెమిస్ట్రీలో ఎక్కువగా 20 శాతం సిలబస్‌ తగ్గింది. దీనివల్ల విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఫస్టియర్, సెకండియర్‌ కలిసి కెమిస్ట్రీలో అత్యధికంగా 9 టాపిక్‌లను తగ్గించారు. ఫిజిక్స్‌లో ఏ టాపిక్‌ తగ్గించలేదు, కానీ సబ్‌ టాపిక్స్‌లో కాన్సెప్ట్‌లను కుదించారు. విద్యార్థులు కష్టంగా ఫీలయ్యే సబ్‌ టాపిక్స్‌ కాన్సెప్ట్‌లను తీసేశారు. బోటనీ, జువాలజీల్లో మూడు చొప్పున టాపిక్‌లను తీసేశారు. అక్కడక్కడ కొన్ని కాన్సెప్ట్‌లకు కోత పెట్టారు. అన్ని సబ్జెక్టుల్లోనూ కొత్త కాన్సెప్ట్‌లను జోడించారు. ఇంటర్‌లో ప్రాక్టికల్స్‌లో ఉండే కాన్సెప్ట్‌లను ఇప్పుడు నీట్‌ పరీక్షలో పెట్టారు. ఆ ప్రకారం విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. కాగా, నీట్‌ యూజీ సిలబస్‌ తగ్గింపుతో ప్రస్తుత సెకండియర్‌ విద్యార్థుల కన్నా, ఫస్టియర్‌ విద్యార్థులకే అధిక ప్రయోజనం అంటున్నారు. నీట్‌ను 2024 మే 5న నిర్వహిస్తారు. ఇంకా నీట్‌ రిజిస్ట్రేషన్లు ప్రారంభం కాలేదు.

**తొలగించిన పాఠ్యాంశాలు**

- **కెమిస్ట్రీ ఫస్టియర్‌:** పదార్థం స్థితి, హైడ్రోజన్, ఎస్‌ బ్లాక్‌ ఎలిమెంట్స్, ఎన్విరాన్‌మెంటల్‌ కెమిస్ట్రీ.
- **కెమిస్ట్రీ సెకండియర్‌:** ఘనస్థితి, ఉపరితల రసాయన శాస్త్రం, మెటలర్జీ, రోజువారీ జీవితంలో పాలిమర్లు, కెమిస్ట్రీ.
- **ఫిజిక్స్‌ ఫస్టియర్‌:** ప్యూర్‌ రోలింగ్, కనెక్టింగ్‌ బాడీలు, పాలిట్రోపిక్‌ ప్రక్రియ, బలవంతమైన, దెబ్బతిన్న డోలనాలు.
- **ఫిజిక్స్‌ సెకండియర్‌:** పొటెన్షియల్, నాన్‌ పొటెన్షియల్‌ సంభావ్యత, ప్రొటెన్షియో మీటర్, ఎర్త్‌ మ్యాగ్నటిజం, రేడియో యాక్టివిటీ, ట్రాన్సిస్టర్లు, ఆంప్లిఫయర్లు.

**జువాలజీ యూనిట్‌–2:** వానపాములు, యూనిట్‌–5లో శరీర నిర్మాణశాస్త్రం, జీర్ణక్రియ శోషణం, జ్ఞానేంద్రియాలు (చెవులు, కళ్లు), యూనిట్‌–10లో జీవావరణం, పర్యావరణం, పర్యావరణ సమస్యలు, పశుసంవర్ధకం.
**బోటనీ ఫస్టియర్‌:** ప్లాంట్‌ ఫిజియాలజీలో ట్రాన్స్‌పోర్ట్‌ ఇన్‌ ప్లాంట్స్, మినరల్‌ న్యూట్రిషన్, మార్ఫాలజీ.
**బోటనీ సెకండియర్‌:** స్ట్రాటజీస్‌ ఫర్‌ ఎన్‌హ్యాన్స్‌మెంట్‌ ఇన్‌ ఫుడ్‌ ప్రొడక్షన్.
**బోటనీలో కొత్తగా చేర్చినవి:** బయో మాలిక్యూల్స్, ఎంజైములు, ప్రాపర్టీలు, మాల్వేస్, లెగుమనీస్‌ సహా మరికొన్ని అంశాలు.

**ముందే సిలబస్‌ను తగ్గిస్తే బాగుండేది**

"సిలబస్‌ తగ్గింపు విషయాన్ని ఆలస్యంగా చెప్పడం వల్ల పిల్లలకు అంతగా ఊరట ఉండదు. ఇది ఎప్పుడో ముందే చెప్పాల్సింది. అలా చేసుంటే వాటిని చదవాల్సిన అవసరం ఉండేది కాదు. వాటిని ఇప్పటికే పిల్లలు చదివేశారు. అయితే రివిజన్‌లో చదవకుండా చూసుకోవాలి. ఏదిఏమైనా సిలబస్‌ తగ్గింపు పిల్లలకు ప్రయోజనం కలిగించేదే." – శంకర్‌రావు, డీన్, శ్రీచైతన్య కాలేజీ

## బోనాలపై భారీ చిత్రం

**1,042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రం**



**ఆత్మకూరు(ఎం):** తెలంగాణ సంప్రదాయ పండుగల్లో ప్రధానమైన బోనాల పండుగకు విశ్వవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చేందుకు భారీ చిత్రాన్ని వేశాడొక కళాకారుడు. బోనాల పండుగ విశిష్టతను తెలియజేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం కొరటికల్‌ గ్రామానికి చెందిన మహేశ్వరం నరహరి ఈ భారీ చిత్రాన్ని చిత్రించారు. ఇందుకోసం 15 కిలోల కారం, 15 కిలోల పసుపు ఉపయోగించారు. 1042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రించేందుకు 10 గంటల 33 నిమిషాల సమయం తీసుకుందని ఆయన వివరించారు.

## ఎయిర్‌పోర్టులో కావూరి కుమార్తె అరెస్ట్‌

- పాత కేసులో రాజస్తాన్‌ పోలీసుల లుక్‌అవుట్‌ నోటీస్‌
- ఓ భూయజమానిని ఆర్థికంగా మోసం చేశారని కేసు



**శంషాబాద్‌:** రాజస్తాన్‌ పోలీసుల లుక్‌ఔట్‌ నోటీసు మేరకు మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు కుమార్తె శ్రీవాణిని శంషాబాద్‌ విమానాశ్రయంలో ఇమిగ్రేషన్‌ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గురువారంరాత్రి ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్‌ వెళ్లేందుకు వచ్చిన శ్రీవాణిని అడ్డుకుని రాజస్తాన్‌ పోలీసులకు సమాచారం అందించారు. అప్పటివరకు ఆమెను ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. శుక్రవారం ఉదయం రాజస్తాన్‌ పోలీసులు వచ్చి కేసుకు సంబంధించిన ఎఫ్‌ఐఆర్‌ కాపీలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి రాజేంద్రనగర్‌ మెట్రోపాలిటన్‌ జడ్జి ముందు హాజరుపర్చారు. తమ స్థలంలో మట్టిని తవ్వి తరలించిన విషయంలో ఆర్థికంగా మోసం చేసినట్లు సంబంధిత భూ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు సమాచారం. ఆ కేసులో విచారణకు ఆమె హాజరుకాకపోవడంతో అక్క డి పోలీసులు లుక్‌ఔట్‌ నోటీసులిచ్చారు. తాజాగా కోర్టు ముందు హాజరుపర్చిన అనంతరం ఆమెను రాజస్థాన్‌కు తరలించారు.

# కొన ‘ఊపిరి’ నిలబెట్టారు!



రోహిత్‌తో వైద్యులు, వైద్య సిబ్బంది

- విజయవంతంగా రెండు ఊపిరితిత్తుల మార్పిడి
- పురుగుల మందు తాగిన యువకుడికి నిర్వహణ
- ప్రపంచంలో 4వ అరుదైన ట్రాన్స్‌ప్లాంట్‌
- యశోద ఆస్పత్రి ఘనత

**రాంగోపాల్‌పేట్‌:** విషం తాగి తీవ్ర ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన ఓ యువకుడికి యశోద ఆస్పత్రి వైద్యులు అరుదైన ఆపరేషన్‌తో ప్రాణం పోశారు. ఒకేసారి డబుల్‌ లంగ్స్‌ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా చేసి చరిత్ర సృష్టించారు. ప్రపంచంలో ఇలాంటి శస్త్ర చికిత్స నాలుగవది కావడం గమనార్హం. శుక్రవారం సికింద్రాబాద్‌ యశోద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి డైరెక్టర్‌ గోరుకంటి పవన్, సీనియర్‌ ఇంటర్వెన్షనల్‌ పల్మనాలజిస్టు డాక్టర్‌ హరికిషన్‌లు వివరాలను వెల్లడించారు. మహబూబాబాద్‌ జిల్లా మర్రాయిగూడెంకు చెందిన 23 ఏళ్ల రోహిత్‌ గత నెలలో వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగి, ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లడంతో అతన్ని సికింద్రాబాద్‌ యశోద ఆస్పత్రిలో చేర్చారు. విషం ఊపిరితిత్తుల్లోకి వెళ్లి కోలుకోలేని పల్మనరీ ఫైబ్రోసిస్‌ పరిస్థితి ఏర్పడింది. అలాగే కిడ్నీలు, కాలేయం కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆయనకు మెకానికల్‌ వెంటిలేటర్స్‌ వైద్యం అందించిన తర్వాత 20 రోజులకు పైగానే ఎక్మోపై చికిత్స అందించారు. అయినా ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడలేదు. దీంతో రెండు ఊపిరితిత్తులను మారిస్తేనే యువకుడి ప్రాణాలు నిలబెట్టవచ్చని వైద్యులు భావించారు. కానీ భారతదేశంలో ఇలాంటి కేసుల్లో ఎక్మో వరకు వెళ్లి ప్రాణాలతో బయటపడిన వాళ్లు లేరు. శరీరంలో ఎటువంటి పురుగుల మందు అవశేషాలు లేవని నిర్ధారించుకున్నాక ఊపిరితిత్తుల మార్పిడి కోసం జీవన్‌దాన్‌లో నమోదు చేశారు. జీవన్‌దాన్‌ చొరవతో ఇంటర్వెన్షనల్‌ పల్మనాలజిస్టు డాక్టర్‌ హరికిషన్, థొరాసిక్‌ లంగ్‌ ట్రాన్స్‌ప్లాంట్‌ సర్జన్‌ డాక్టర్‌ కేఆర్‌ బాల సుబ్రహ్మణ్యం, డాక్టర్‌ మంజునాథ్‌ బాలే, డాక్టర్‌ చేతన్, డాక్టర్‌ శ్రీచరణ్, డాక్టర్‌ మిమి వర్గీస్‌లతో కూడిన బృందం ఆరు గంటల పాటు శ్రమించి విజయవంతంగా రెండు ఊపిరితిత్తులను మార్చారు. సంపూర్ణమైన ఆరోగ్యంతో రోహిత్‌ను డిశ్చార్జ్‌ చేసినట్లు వైద్యులు తెలిపారు.

## అమ్మాయి జన్మిస్తే 111 మొక్కలు

- శ్యాంసుందర్‌ పలివాల్‌ వినూత్న కృషి..షార్ట్‌ ఫిల్మ్‌ను షేర్‌ చేసిన ఎంపీ సంతోష్‌ కుమార్‌

**సాక్షి, హైదరాబాద్‌:** ఆడబిడ్డ జన్మను పర్యావరణ పరిరక్షణకు ముడిపెడుతూ పద్మశ్రీ శ్యామ్‌ సుందర్‌ పలివాల్‌ చేస్తున్న కృషిని ఎంపీ జె.సంతోష్‌ కుమార్‌ అభినందించారు. దాదాపు ముప్పై ఏళ్లుగా రాజస్తాన్‌ బలోత్రా జిల్లాలో శ్యాంసుందర్‌ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫాదర్‌ ఆఫ్‌ ఎకో ఫెమినిస్టుగా పేరొందిన శ్యాంసుందర్‌ తన సొంత గ్రామం పిప్లాంత్రితోపాటు చుట్టుపక్కల ఎక్కడ ఆడపిల్ల పుట్టినా, ఆ అమ్మాయి పేరు మీదు నూటా పదకొండు మొక్కలు నాటడం, నాటించడం చేస్తున్నారు. పర్యావరణ క్షీణతతో ఎంతటి విపత్తును ఎదుర్కొంటున్నామో, ఆడబిడ్డల నిష్పత్తి పడిపోతే సమాజం అంతే ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని ఆయన చెబుతుంటారు. సుందర్‌ పలివాల్‌ కృషిలో భాగస్వామ్యమైన ఆస్ట్రల్‌ ఫౌండేషన్, ఆయా గ్రామాల్లో నాటిన మొక్కల పరిరక్షణ కోసం 13 కిలోమీటర్ల పైపులైన్‌ను ఏర్పాటు చేసింది. హాస్పిటల్‌లో అమ్మాయి పుడితే ఊరు ఊరంతా తరలిరావటం, వేడుకగా మొక్కలు నాటే పండగను భావోద్వేగంగా చిత్రీకరించిన షార్ట్‌ ఫిల్మ్‌ను ఎక్స్‌(ట్విట్టర్‌)లో సంతోష్‌ కుమార్‌ షేర్‌ చేస్తూ పలివాల్‌ అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు.

## విమలక్కకు ‘సుద్దాల’ పురస్కారం



విమలక్కను పురస్కారంతో సత్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ రాధారాణి. చిత్రంలో ఆర్‌.నారాయణమూర్తి, సుద్దాల అశోక్‌తేజ, కోయి కోటేశ్వర్‌రావు, రచ్చ భారతి, ప్రొఫెసర్‌ కాశీం

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం(హైదరాబాద్‌):** ప్రజా గాయని, అరుణోదయ విమలక్కకు సుద్దాల హన్మంతు– జానకమ్మల జాతీయ పురస్కారాన్ని అందజేశారు. సుద్దాల ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో శుక్రవారంరాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ జి.రాధారాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జస్టిస్‌ రాధారాణి మాట్లాడుతూ ప్రజావాగ్గేయకారుడు సుద్దాల హన్మంతు పేరిట అవార్డు ప్రదానం చేయడం గొప్ప అదృష్టమన్నారు. ప్రజాకవిగా, కళాకారుడిగా అంతకుమించి క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టుగా జీవితాంతం కష్టజీవుల కోసం, కమ్యూనిస్టు ఉద్యమం కోసం కృషి చేసిన హన్మంతు మహనీయుడని కొనియాడారు. ఆయన గొప్ప ప్రజావాగ్గేయకారుడని పేర్కొన్నారు. ప్రజానటుడు, సినీదర్శకుడు ఆర్‌.నారాయణమూర్తి మాట్లాడుతూ కులోన్మాద, మతోన్మాద, రాజ్యోన్మాద శక్తులను ధిక్కరించడానికి, ప్రజలను మేలుకొల్పడానికి ప్రజావాగ్గేయకారుడుగా సుద్దాల హన్మంతు చేసిన కృషి మరువలేనిదన్నారు. తెలంగాణ పాటకు, ఆటకు జరుగుతున్న సత్కారమే విమలక్కకు అవార్డు అని పేర్కొన్నారు. అవార్డు గ్రహీత విమలక్క మాట్లాడుతూ సుద్దాల హన్మంతు పురస్కారం అందుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ కోయి కోటేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుద్దాల ఫౌండేషన్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్‌ సుద్దాల అశోక్‌తేజ, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్‌ కాశీం, ప్రముఖ రచయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మి, ‘మోదుగుపూలు’ఎడిటర్‌ భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ ప్రభుత్వ వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్‌తేజ, సుద్దాల హన్మంతు కూతురు రచ్చ భారతి, కుటుంబసభ్యులు సుద్దాల ప్రభాకర్, బల్లా కౌముది, సుద్దాల స్వప్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుద్దాల పుర ప్రముఖులు యాగమాటి జగన్మోహన్‌రెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు.

## ముగిసిన అన్వేషణ

- దొరకని అసలు దొంగలు
- బదిలీ కమిషనర్‌ సంతకాల పేరిట నాటకం
- పూర్తయిన రిమాండ్, ఖమ్మం జైలుకు అన్వేశ్‌

**వరంగల్‌ అర్బన్‌:** రూ.2.32 కోట్ల నిధులు కాజేసిన బల్దియా సీనియర్‌ అసిస్టెంట్‌ బండా అన్వేశ్‌ విచారణ శుక్రవారం ముగిసింది. బదిలీ అయిన కమిషనర్‌ పమేలా సత్పతి సీసీగా పని చేసిన అన్వేశ్‌ కస్టడీ కొలిక్కి రాలేదని సమాచారం. గ్రేటర్‌ వరంగల్‌ బదిలీ కమిషనర్‌ పమేల సత్పతి ఏడాదికి పైగా విధులు నిర్వహించారు. సుదీర్ఘకాలంగా సీసీగా పని చేస్తున్న సీసీ అన్వేశ్‌.. కమిషనర్‌ బిజీగా ఉన్న సమయంలో ప్రజాధనం కాజేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. బల్దియాలోని ఓ ఉద్యోగి సమాచారంతో వెలుగు చూసిన ఈఅవినీతి బాగోతం బల్దియాలో కలకలం రేపింది. హైదరాబాద్‌ నుంచి పురపాలక శాఖ ఉన్నతాధికారుల విచారణలో కోట్లు కొల్లగొట్టిన విషయం రుజువైంది. ఈనేపథ్యంలో బల్దియా అధికారుల ఫిర్యాదు మేరకు వరంగల్‌ మట్టెవాడ పోలీసులు సదరు సీనియర్‌ అసిస్టెంట్‌ అన్వేశ్‌ను అరెస్టు చేసి జైలుకు పంపించారు. మట్టెవాడ పోలీసులు మూడ్రోజులుగా విచారణ చేపట్టగా.. పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. కమిషనర్‌ బిజీగా ఉన్న సందర్భంలో ఆమె ద్వారా సంతకాలు పెట్టించినట్లు అన్వేశ్‌ వెల్లడించినట్లు తెలిసింది. కానీ వాస్తవ విషయాలు వెల్లడించేందుకు అతడు నిరాకరించినట్లు సమాచారం. ఎన్ని ప్రశ్నలు వేసినా.. సదరు ఉద్యోగి నోరుమెదపలేదని, వాస్తవాలను వెల్లడించలేదని సమాచారం. పోలీసు అధికారులు మాత్రం ప్రజాధనాన్ని మళ్లించిన బ్యాంక్‌ అకౌంట్లు, వ్యక్తులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిసింది.

# సారూ.. వేతనాలు చెల్లించరూ!

- ఎంజీఎంలో పలువురు కార్మికులకు అందని వేతనాలు!
- ఔట్‌సోర్సింగ్‌ కింద ఇస్తామన్న సూపరింటెండెంట్‌
- మనస్తాపంతో ముగ్గురి ఆత్మహత్యాయత్నం






చికిత్స పొందుతున్న కార్మికులు, 16 మందిని నియమించినట్లు ఏజెన్సీ నియామక పత్రం

**ఎంజీఎం:** ఎంజీఎం ఆస్పత్రిలో ప్రతీ నియామకం వివాదంగానే మారుతోంది. ఈక్రమంలో సూపరింటెండెంట్‌ డాక్టర్‌ చంద్రశేఖర్‌ మొండి వైఖరిని నిరసిస్తూ.. శుక్రవారం మధ్యాహ్నం ముగ్గురు కార్మికులు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. మూడు నెలలుగా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ వేతనాలు చెల్లించకుండా సూపరింటెండెంట్‌ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వారు పేర్కొంటున్నారు. 16 మంది కార్మికులు సూపరింటెండెంట్‌ కార్యాలయం చుట్టూ రెండు, మూడ్రోజులుగా ప్రదక్షిణలు చేస్తున్నారు. కాగా.. శుక్రవారం సూపరిండెంట్‌తో కార్మికులు చర్చలు జరిపి వేతనాలు చెల్లించాలని కోరారు. ఈక్రమంలో 300 ఓసీఎస్‌లో పద్దులో కాకుండా.. ఎంజీఎం ఆస్పత్రిలో కృష్ణ కన్‌స్ట్రక్షన్‌ ఏజెన్సీ ద్వారా వేతనాలు చెల్లిస్తామని చెప్పడంతో కార్మికులు ఆవేదనకు గురయ్యారు. చాంబర్‌ ఎదుట క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. వెంటనే అక్కడున్న సిబ్బంది వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలోని అత్యవసర విభాగానికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి మెరుగ్గా ఉందని ఎంజీఎం సూపరింటెండెంట్‌ తెలిపారు. 24 గంటలు గడిస్తే కానీ.. చెప్పలేమని డ్యూటీ డాక్టర్లు పేర్కొనడం గమనార్హం.

**ఏళ్ల తరబడిగా సాగుతున్న వివాదం..**

ఎంజీఎం ఆస్పత్రికి సుమారుగా 20 నెలల క్రితం 300 ఓసీఎస్‌ పద్దు కింద 35 పోస్టులు మంజూరయ్యాయి. ఈపోస్టుల్లో శానిటేషన్‌ సీనియార్టీ ప్రకారం ఉన్నవారిని నియమించాలి. కానీ.. ఈ పోస్టుల మంజూరు కాస్తా.. 35 మంది పేర్లతో రావడం ఇబ్బందిగా మారింది. ఈవిషయాన్ని గమనించిన పరిపాలనాధికారులు ఏడాదిన్నర క్రితం అర్హులైన 19 మందిని నియమించి విధులు కేటాయించారు. అనంతరం 16 మంది పేర్లను తొలగించి ఎంజీఎం ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తూ అర్హులైన 13 మందికి, ముగ్గురు వికలాంగులకు తెలంగాణ అభ్యుదయ ఏజెన్సీ ఔట్‌సోర్సింగ్‌ ఏజెన్సీ ద్వారా జూలై 23న 300 ఓసీఎస్‌ పద్దు ద్వారా నియామకాలు చేపట్టారు. ఈక్రమంలో వీరందరినీ ఆస్పత్రిలో సర్జెంట్‌ పర్యవేక్షణలో పాత 19 మంది కార్మికులు.. కొత్తగా 16 మంది కార్మికులు విధులు నిర్వర్తించేలా ప్రత్యేక వార్డును సైతం కేటాయించారు. ఈక్రమంలో 35 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తూ వస్తున్నారు.

**అత్యవసర విభాగంలో చికిత్స**

క్రిమి సంహారక మందు సేవించిన కార్మికులను అక్కడే ఉన్న తోటి కార్మికులు హుటాహుటిన ఆస్పత్రిలోని క్యాజువాలిటీకి తరలించి చికిత్సలు అందించారు. ప్రస్తుతం వారికి పరిస్థితి క్షేమంగానే ఉన్నట్లు సూపరింటెండెంట్‌ డాక్టర్‌ చంద్రశేఖర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. 24 గంటల పాటు ప్రత్యేక అబ్జర్వేషన్‌లో ఉన్నట్లు డ్యూటీ వైద్యులు పేర్కొంటున్నారు.

**మొదలైన రగడ**

300 ఓసీఎస్‌ పద్దు కింద నియమించిన కార్మికులకు వేతనాల చెల్లింపులో అధికారుల మొండి వైఖరితో రగడ మొదలైంది. మొదటి నెల అభ్యుదయ ఏజెన్సీ ద్వారా బిల్లు చేయించిన అధికారులు, రెండో నెల నుంచి ఆస్పత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ కాంట్రాక్టు పొందిన కృష్ణ కన్‌స్ట్రక్షన్‌ నుంచి వేతనాలు తీసుకోవాలని చెప్పారు. దీంతో కార్మికుల్లో ఆందోళన మొదలైంది. తెలంగాణ అభ్యుదయ ఏజెన్సీతో 300 ఓసీఎస్‌ కింద నియమితులైన తాము కృష్ణ కన్‌స్ట్రక్షన్‌ ద్వారా ఎందుకు వేతనాలు తీసుకుంటామని సూపరింటెండెంట్‌ను ప్రశ్నించారు. ఈక్రమంలో సూపరింటెండెంట్‌కు, కార్మికులకు మధ్య జరిగిన ఘర్షణతో శుక్రవారం మధ్యాహ్నం గడల రమేశ్, గందె పద్మ, బొంత సంధ్య సూపరింటెండెంట్‌ చాంబర్‌ ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు.

**ఫైల్‌ పెండింగ్‌లో ఉంది..**

"జీఓ నంబర్‌ 34 ప్రకారం.. 16 మంది కార్మికులు వేతనాలు చెల్లించాలని డిమాండ్‌ చేశారు. ఈ ఫైల్‌ సచివాలయంలో పెండింగ్‌ ఉందని సూపరిండెంట్‌ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యుదయ ఏజెన్సీ ద్వారా కాకుండా, కృష్ణ కన్‌స్ట్రక్షన్‌ ద్వారా వేతనాలు తీసుకోవాలని చెప్పాం. బెదిరించే ధోరణిలో ఆత్మహత్యకు యత్నించారు."
– చంద్రశేఖర్, సూపరింటెండెంట్‌

## అంబేడ్కర్‌ అందరివాడు



అభివాదం చేస్తున్న నాయకులు

**కాజీపేట రూరల్‌:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీ.ఆర్‌.అంబేడ్కర్‌ అందరివాడని రిటైర్డ్‌ ఐపీఎస్‌ అధికారి కే.ఆర్‌.నాగరాజు, జాతీయ మాలమహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు అన్నారు. అమెరికాలో స్టాచ్యూ ఆఫ్‌ ఈక్వాలిటీ పేరిట శనివారం డాక్టర్‌ బి.ఆర్‌.అంబేడ్కర్‌ 19అడుగుల కాంస్య విగ్రహాన్ని మేరీల్యాండ్‌ అనే ప్రాంతంలో 13 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న సందర్భంగా వరంగల్‌ ఎంజీఎం జంక్షన్‌ నుంచి కాజీపేట జంక్షన్‌ వరకు శుక్రవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాజీపేట జంక్షన్‌లోని ఆల్‌ ఇండియా ఎస్సీ ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ కార్యాలయంలో రైల్వే జేఏసీ చైర్మన్‌ కొండ్ర నర్సింగరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైల్వే ఓబీసీ జోనల్‌ ప్రెసిడెంట్‌ సంతోష్‌కుమార్, మాల మహానాడు గ్రేటర్‌ వరంగల్‌ అధ్యక్షుడు అంకేశ్వరపు రామచంద్ర, ఎస్సీ ఎస్టీ డీజిల్‌ బ్రాంచ్‌ అధ్యక్షుడు శ్రీనివాస్‌ నాయక్‌ మాట్లాడుతూ.. సమాజంలో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన నాయకుడు అంబేడ్కర్‌ అని కొనియాడారు. సమావేశంలో రైల్వే ఎస్సీ ఎస్టీ అసోసియేషన్‌ సికింద్రాబాద్‌ డివిజన్‌ ప్రెసిడెంట్‌ వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

## పరిమళ కాలనీలో చోరీ

- రూ.2.50లక్షలు మాయం



వేలిముద్రలు సేకరిస్తున్న నిపుణులు

**హసన్‌పర్తి:** నగరంలోని 56వ డివిజన్‌ పరిమళ కాలనీ చోరీ జరిగింది. కాలనీకి చెందిన మగ్బూలుద్దీన్‌ గత నెల 27తేదీన ఇంటికి తాళం వేసి విదేశాలకు వెళ్లాడు. అయితే శుక్రవారం మగ్బూలుద్దీన్‌ ఇంటితాళాలు పగుల్లగొట్టి కనిపించడంతో స్థానికులు పోలీసులతోపాటు బాధితుడి కూతురుకు సమాచారం అందించారు. కాకతీయ యూనివర్సిటీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈక్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలోని రూ.2.50లక్షలు, తులంన్నర బంగారు ఆభరణాలు మాయమైనట్లు బాధితుడి కూతురు జహారఖాతున్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిపుణులు వేలిముద్రలు సేకరించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌ఇన్‌స్పెక్టర్‌ అబ్బయ్య తెలిపారు. అయితే బాధితుడు ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలకు దుండగులు ముసుగు వేసి.. పైకి ఎత్తినట్లు పోలీసులు గుర్తించారు. కాగా, పరిసర ప్రాంతాలకు చెందిన వారే ఈ చోరీకి పాల్పడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం దసరా పండుగకు ఊర్లకు వెళ్లే వారు ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీస్‌ఇన్‌స్పెక్టర్‌ అబ్బయ్య తెలిపారు.

# కేయూలో ఇండియన్‌ హిస్టరీ కాంగ్రెస్‌

- డిసెంబర్‌ 28, 29, 30 తేదీల్లో నిర్వహణ



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రమేష్‌

**కేయూ క్యాంపస్‌:** కాకతీయ విశ్వవిద్యాలయ వేదికగా ఈఏడాది డిసెంబర్‌ 28, 29, 30 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించే ప్రతిష్టాత్మక ఇండియన్‌ హిస్టరీ కాంగ్రెస్‌ 82వ సెషన్‌ను విజయవంతం చేద్దామని కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్‌ అన్నారు. శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయ అతిథి గృహంలో ఇండియన్‌ హిస్టరీ కాంగ్రెస్‌ విశ్వవిద్యాలయ మానిటరింగ్‌ కమిటీతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేయూ ప్రతిష్టను పెంచేందుకు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ప్రారంభం నుంచి ముగింపు సమావేశం ప్రకారం ప్రణాళికతో ముందుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు అనుగుణంగా బడ్జెట్‌ రూపకల్పన, నిధుల సమీకరణ, అతిథులకు వసతి ఏర్పాట్లు, ఆహ్వానితులకు సౌకర్యాల కల్పన, వివిధ దేశాల నుంచి, దేశ వ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల నుంచి, జాతీయ సంస్థల నుంచి కేయూకు వచ్చే చరిత్రకారుల ప్రతినిధుల రవాణా, వసతి, భోజన ఏర్పాట్లు, లోకల్‌ పర్యాటక ప్రాంతాల సందర్శనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వారి అనుభవాలు, పరిశోధనలు విశ్వవిద్యాలయ బోధనా సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులకు ఉపయోగపడేలా సమావేశాలు, సెషన్‌లు, గోష్టిలు ఏర్పాటు చేయాలన్నారు. ఐదు, ఆరు తరాల చరిత్రకారులు హాజరువుతున్న దృష్ట్యా అవసరమైన కమిటీల ఏర్పాట్లు, ముందస్తు సమావేశాలు, అందులో తీసుకున్న నిర్ణయాల అమలుపై దృష్టి పెట్టాలన్నారు. 30వేలకు పైగా సభ్యులు ఉన్న ఇండియన్‌ హిస్టరీ కాంగ్రెస్‌ లో ఈ సమావేశానికి సుమారు 2,000 మంది హాజరు అవుతారని తెలిపారు. 30సంవత్సరాల తర్వాత కేయూ వేదికగా నిర్వహిస్తున్న ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కేయూ రిజిస్ట్రార్‌ ఆచార్య శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పొరపాట్లు పని చేయాలన్నారు. ఇండియన్‌ హిస్టరీ కాంగ్రెస్‌ లోకల్‌ సెక్రటరీ ఆచార్య మనోహర్‌ సంక్షిప్త రిపోర్ట్‌ను మానిటరింగ్‌ కమిటీలో వివరించారు. ఈ సమావేశంలో హిస్టరీ విభాగం విశ్రాంత ఆచార్యులు ఎస్‌.శ్రీనాథ్, వివిధ విభాగాల ఆచార్యులు రామస్వామి, మల్లికార్జున రెడ్డి, బన్న అయిలయ్య, నరసింహాచారి, శ్రీనివాస రావు, ఫైనాన్సు ఆఫీసర్‌ రాజయ్య, అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ డాక్టర్‌ కోలా శంకర్‌ పాల్గొన్నారు.

## మిర్చి పంటకు ‘గుబ్బ’ రోగం



ఏపుగా పెరిగిన మిర్చి పంటను దున్నుతున్న రైతు

**కురవి:** నల్లెల్ల శివారు సూర్యతండాకు చెందిన రైతు తేజావత్‌ మంగ్యా రెండు ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేస్తున్నాడు. రూ.1.20లక్షల పెట్టుబడి పెట్టిన రైతు పంట ఏపుగా పెరగడంతో సంతోషపడ్డాడు. అయితే ఆ సంతోషం చాలారోజులు నిలువలేదు. గుబ్బ రోగం సోకి మిర్చి పంట మొత్తం ముడుసుకుపోయింది. మొక్కల్లో పెరుగుదల లోపించింది. ఎన్ని మందులు కొట్టినా ఫలితం లేకుండాపోయింది. దీంతో ఏపుగా పెరిగిన మిర్చితోటను రైతు మంగ్యా శుక్రవారం ట్రాక్టర్‌తో పూర్తిగా దున్నేశాడు. కాగా, నంగారభేరి నాయకులు బానోత్‌ విష్ణు నాయక్‌ పంటను సందర్శించి రైతును ఓదార్చాడు. పంటకు పరిహారం చెల్లించాలని డిమాండ్‌ చేశాడు.

## టీచర్ల సంక్షేమమే పీఆర్టీయూ ధ్యేయం

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి




మాట్లాడుతున్న పింగిళి శ్రీపాల్‌రెడ్డి

**విద్యారణ్యపురి:** తెలంగాణలో ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా పీఆర్టీయూ కృషి చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండలోని తారా గార్డెన్స్‌లో యూనియన్‌ హనుమకొండ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల వివిధ సమస్యల్ని పరిష్కరించింది పీఆర్టీయూ అన్నారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి సర్వీస్‌ రూల్స్‌ సాధిస్తామన్నారు. మల్టీజోన్‌–1లో టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సక్రమంగా జరిగేలా కృషిచేశామన్నారు. ఇటీవల జరిగిన టీచర్ల బదిలీలపై ఇతర జిల్లాల నుంచి హనుమకొండకు వచ్చిన వారికి, స్కూల్‌ అసిస్టెంట్ల నుంచి హెచ్‌ఎం గ్రేడ్‌–2 పొందిన ఉపాధ్యాయులకు మండలాల వారీగా సన్మానాలు చేశారు. అనంతరం పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డిని గజమాలతో సన్మానించారు. ఇందులో పీఆర్టీయూ నాయకులు మంద తిరుపతిరెడ్డి, ఫలిత శ్రీహరి, రవీందర్‌రెడ్డి, గఫార్, ఇన్నారెడ్డి, మహిపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, సుభాకర్‌రెడ్డి, కిరణ్, యాకూబ్‌ రెడ్డి, పట్టాభి, ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రాఘవరెడ్డి, దేవిరెడ్డి మలాకొండారెడ్డి, సంధ్యారాణి, సుమ, అనురాధ, రమాదేవి, శ్రీపాల, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.